బినోల బైపాస్‌కు మోక్షమెప్పుడో?

- అటకెక్కిన ప్రతిపాదనలు
- ఇరుకు రోడ్డుతో వాహనదారుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



ప్రమాదకరంగా మారిన బినోల ముఖద్వారం దగ్గర మూల మలుపు

నవీపేట: మండలంలోని బినోల గ్రామంలోని ప్రధాన రహదారి ఇరుకుగా ఉండడంతో గ్రామస్తులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గాంధీనగర్ మీదుగా నాళేశ్వర్, నందిగామ్, నిజాంపూర్, తుంగిని గ్రామాలకు బినోల మీదుగా వెళ్లాల్సి వస్తుంది. నాళేశ్వర్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సుతో పాటు స్కూల్ బస్సులు, టిప్పర్‌లు ఇరుకుగా ఉన్న ఈ రహదారి వెంబడి వెళ్తుంటాయి. కానీ కిలోమీటర్ పొడవుతో ఇరుకుగా ఉన్న ఈ రహదారి వెంబడి ఒక వైపు పెద్ద వాహనం వస్తే మరో వైపు వచ్చే వాహనం వెనక్కి వెళ్లాల్సి రావడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

జీపీ పరిధిలో రోడ్డు..

బినోలకు ఇరువైపులా ఆర్అండ్‌బీ రోడ్డు విస్తరించుకోగా గ్రామంలో ఇరుకైనా ప్రధాన రహదారి జీపీ పరిధిలో ఉంది. దీంతో ఈ రోడ్డుపై అధికారులు చిన్నచూపు చూస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరుకుగా ఉన్న ప్రధాన రహదారితో పాటు బినోల గ్రామ ముఖద్వారం వద్ద ఉన్న మూల మలుపు ప్రమాదకరంగా మారింది. దీంతో



అధ్వానంగా మారిన మట్టిరోడ్డు

బైపాస్ రోడ్డు వేయాలని గతంలో గ్రామస్తులు ప్రజాప్రతినిధులు, అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నారు. అయిదేళ్ల కిందట చెరువు కట్ట అంచు వెంబడి గ్రామ శివారులోని పాఠశాల వద్దకు బైపాస్‌ను నిర్మించాలని గ్రామస్తులు ఎమ్మెల్యే, అప్పటి ఎంపీ కవితకు విన్నవించగా.. వారు సానుకూలంగా స్పందించారు. ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు సూచించగా అప్పటి ఆర్అండ్‌బీ ఏఈ దినేష్ చందర్ ప్రతిపాదనలు రూపొందించారు. కానీ ఏఈ దినేష్ చందర్ గుండెపోటుతో మృతి చెందడంతో ప్రతిపాదనల ప్రస్తావన అటకెక్కింది. తర్వాత వచ్చిన అధికారులు ఈవిషయమై ప్రతిపాదనల జోలికి వెళ్లలేదు. కొత్త మండల కేంద్రం ఏర్పాటుకు ప్రయత్నిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు ఇప్పటికైనా స్పందించి గ్రామంలో బైపాస్ రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా మూలమలుపు..



బినోల ముఖద్వారం దగ్గర ఉన్న మూల మలుపు ప్రమాదకరంగా మారింది. ఇదే మూల మలుపు దగ్గర మరోవైపు చెరువు ఉండడంతో ఇబ్బంది ఎదురవుతుంది. బైపాస్ రోడ్డు వేయాలని గతంలో ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించాం. గతంలో సర్వేలు చేపట్టిన అధికారులు మళ్లీ బైపాస్ రోడ్డు ఊసెత్తడం లేదు.

–అయిటి విజయ్, సొసైటీ డైరెక్టర్, బినోల

సర్వే చేయలేదు..

అయిదేళ్ల కిందట చేపట్టిన ప్రతిపాదనల గురించి నాకు తెలియదు. బైపాస్ రోడ్డు వేయాలని పలుమార్లు గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుతం ఎలాంటి సర్వేలు చేయడం లేదు. ఉన్నతాధికారుల ఆదేశాలతోనే మళ్లీ ప్రతిపాదనలు చేస్తాం. కానీ ఇప్పటి వరకు బైపాస్ ప్రస్తావన రాలేదు.

–రామ్మోహన్, డీఈఈ ఆర్అండ్‌బీ

మహోన్నత మానవతావాది బసవేశ్వరుడు




సాలూరలో బసవేశ్వరుడి జయంతి వేడుకల్లో ఆర్డీవో రాజేశ్వర్, ప్రజాప్రతినిధులు.. కోటగిరిలో..

- బోధన్ ఆర్డీవో రాజేశ్వర్
- ఘనంగా బసవేశ్వర జయంతి

బోధన్: మానవీయ విలువలు, కుల రహిత, వర్ణ, లింగ వివక్షత లేని సమసమాజం కోసం తపించి అపార కృషి చేసిన మహోన్నత మానవతావాది మహాత్మా బసవేశ్వరుడని బోధన్ ఆర్డీవో రాజేశ్వర్ అన్నారు. కుల వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా వీరశైవ లింగాయత్ ధర్మాన్ని స్థాపించారని పేర్కొన్నారు. సాలూర మండల కేంద్రంలో శనివారం వీరశైవలింగాయత్ సమాజ్ గ్రామ కమిటీ అధ్వర్యంలో మహాత్మా బసవేశ్వరుడి జయంతిని ఘనంగా నిర్వహించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్డీవో, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి బసవేశ్వరుడి విగ్రహానికి పూల మాలలు వేసి, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. తహసీల్దార్ మమత, ఎంపీపీ బుద్దె సావిత్రి రాజేశ్వర్, ఏఎంసీ చైర్మన్‌వీఆర్ దేశాయ్, డీసీసీబీడైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి, సర్పంచ్ భుయ్యన్ చంద్రకళ రాజప్ప పటేల్, సొసైటీ చైర్మన్ అల్లె జనార్దన్ పాల్గొన్నారు.

రుద్రూర్: మండలంలోని గైనిగుట్ట స్వయంభూ బసవేశ్వర స్వామి ఆలయంలో శనివారం బసవ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.



గైనిగుట్ట స్వయంభూ బసవేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

రుద్రూర్: కోటగిరి, పోతంగల్ మండలాల్లో శనివారం లింగాయత్‌ల ఆధ్వర్యంలో బసవేశ్వర జయంతి నిర్వహించారు. మహత్మ బసవేశ్వర విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. సిద్ది లింగప్ప మహరాజ్, సర్పంచ్‌లు మాదవరావ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సభకు అనుమతి ఇవ్వండి



బోధన్‌టౌన్(బోధన్): ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 30న పట్టణంలో నిర్వహించనున్న మహనీయుల జయంతి ఉత్సవాల సభకు అనుమతి ఇవ్వాలని కమిటీ ప్రతినిధులు శనివారం ఏసీపీ కిరణ్‌కుమార్‌ను కోరారు. మహనీయుల సభకు అధిక సంఖ్యలో తరలి రావాలని ప్రజలను కోరారు. కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

25న బీఆర్ఎస్ ప్రతినిధుల సభ



వేల్పూర్: కమ్మర్‌పల్లిలోని లలిత గార్డెన్‌లో ఈనెల 25న బీఆర్ఎస్ ప్రతినిధుల సభ నిర్వహించనున్నట్లు, పార్టీ శ్రేణులు సభను విజయవంతం చేయాలని జిల్లా ఆర్టీఏ సభ్యుడు రేగుల్లరాములు కోరారు. వేల్పూర్ సొసైటీ ఆవరణలో శనివారం నిర్వహించిన మండల బీఆర్ఎస్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సభకు మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, ప్రతినిధులు తరలిరావాలన్నారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నాగధర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కర్రలే కరెంటు స్తంభాలు



డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ మండలం గంగాసముందర్‌లో గోదావరికి ఆనుకుని సాగవుతున్న పంటలకు విద్యుత్ కష్టాలు ఎదురవుతున్నాయి. కరెంట్ స్తంభాలు లేకపోవడంతో విద్యుత్ వైర్లను ఈవిధంగా కర్రల సాయంతో పంట పొలాలకు ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడ కరెంట్ సౌకర్యం లేకపోతే పంటలు ఎండిపోయే అవకాశముంది. ఇప్పటికైనా స్తంభాలను ఏర్పాటు చేయాలని రైతులు ట్రాన్స్‌కో అధికారులను కోరుతున్నారు.

అమర వీరులకు నివాళులు



ఆర్మూర్‌టౌన్: ఉగ్రదాడిలో అమరులైన ఆర్మీ జవాన్లకు శనివారం పట్టణంలోని క్లాక్ టవర్ జాతీయ జెండా వద్ద బీజేపీ నాయకులు కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. జవాన్ల ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి నర్సింహారెడ్డి, పట్టణ అధ్యక్షుడు జెస్సు అనిల్, వివిధ మోర్చా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదానం సామాజిక అవసరం



నిజామాబాద్‌నాగారం/నిజామాబాద్ సిటీ: రక్తదానం సామాజిక అవసరమని, ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని ఏసీపీ కిరణ్ కుమార్ పేర్కొన్నారు. ఇందూరు యువత స్వచ్ఛంద సేవాసంస్థ రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం పాల్ద గ్రామంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏసీపీ కిరణ్ కుమార్ హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ప్రతి ఒక్కరు సామాజిక సేవలో ముందుండాల ఏసీపీ పిలుపునిచ్చారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దుకూరి సాయిబాబు, ఎంపీటీసీ నరేష్, వీడీసీ సభ్యులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

నందిపేట్‌-లోకేశ్వరం బస్సు ప్రారంభం

నందిపేట్(ఆర్మూర్): నిజామాబాద్ నుంచి నందిపేట మీదుగా లోకేశ్వరం వరకు పల్లెవెలుగు బస్సు శనివారం ప్రారంభమయింది. ఈ సందర్భంగా నందిపేట బస్టాండులో, ఉమ్మెడలోని ఉమమహేశ్వర ఆలయం వద్ద బస్సుకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ బస్సు నందిపేట, లోకేశ్వరం మీదుగా ప్రతిరోజు ఐదు ట్రిప్పులు నడుస్తుంది. ఈ బస్సు ఏర్పాటుతో నందిపేట నుంచి లోకేశ్వరం వెళ్లేందుకు 60కిలో మీటర్ల దూరభారం తగ్గింది. ఇదివరకు లోకేశ్వరం వెళ్లాలంటే నిర్మల్ లేదా భైంసా మీదుగా 85 కిలో మీటర్లు ప్రయాణించాల్సి వచ్చేది. ప్రస్తుతం 25 కిలోమీటర్ల ప్రయాణంతో లోకేశ్వరం చేరుకోవచ్చు.

బస్సు వేళలు:

- నిజామాబాద్ నుంచి లోకేశ్వరం: ఉదయం7.15 గంటలకు
- లోకేశ్వరం నుంచి నిజామాబాద్: సాయంత్రం 6.10 గంటలకు
- నందిపేట నుంచి లోకేశ్వరం: ఉదయం 8.15 గంటలకు, 10.30 గంటలకు, మధ్యాహ్నం 1.00, 3.00, 5.10 గంటలకు
- లోకేశ్వరం నుంచి నందిపేట: ఉదయం 9.20, 11.45 గంటలకు, మధ్యాహ్నం 2.00, 4.00, 6.10 గంటలకు.



నందిపేటకు చేరుకున్న లోకేశ్వరం బస్సు

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో శనివారం రంజాన్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ముస్లింలు ఉదయమే ఈద్గాల వద్దకు వెళ్లి మత పెద్దల సమక్షంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అలాగే మతాలకతీతంగా మిత్రులను ఇంటికి ఆహ్వానించి రంజాన్ ప్రత్యేక వంటకాలతో ఆతిథ్యం అందించారు.

– సాక్షి నెట్‌వర్క్



ఆర్మూర్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



మాక్లూర్ ఈద్గా వద్ద ముస్లిం చిన్నారులతో జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు



నవీపేట మండల కేంద్రంలో..



మోస్రా మండలంలో..



బోధన్ పట్టణంలో..



కోనాసముందర్ గ్రామంలో..



వేల్పూర్ మండల కేంద్రంలో..



నందిపేట్ మండల కేంద్రంలో..



మెండోరా మండలం పోచంపాడ్‌లో..

లెనిన్‌కు ఘన నివాళి



మామిడిపల్లిలో నివాళులు అర్పిస్తున్న సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు



కమ్మర్‌పల్లిలో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

పెర్కిట్(ఆర్మూర్)/నందిపేట్(ఆర్మూర్)/ఆర్మూర్‌టౌన్/బోధన్: ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో శనివారం మార్క్సిస్ట్ మహోపాధ్యాయుడు లెనిన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా మండలాలు, గ్రామాల్లో సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా, న్యూ డెమోక్రసీ పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అలాగే పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ.. లెనిన్ జయంతిని పురస్కరించుకుని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుకుంటున్నట్లు తెలిపారు. నందిపేటలో సీపీఐ ఎంఎల్, ప్రజా పంథా ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు.



నందిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

‘అభివృద్ధిని చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ ఆరోపణలు’

వేల్పూర్: బాల్కొండ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, మంత్రి ప్రశాంత్‌రెడ్డిపై ఆరోపణలకు పాల్పడుతున్నారని మండల బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. మండల కేంద్రంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. బాల్కొండ నియోజకవర్గ అభివృద్ధిపై మానాల మోహన్‌రెడ్డితో బహిరంగ చర్చకు సిద్ధమని, ఆయనతో చర్చించడానికి తామె ఎక్కువని చెప్పారు. ఆయన ఎప్పుడు, ఎక్కడ సిద్ధమన్నా, తాము కూడా సిద్ధమేనని వెల్లడించారు. ఎంపీపీ జమున రాజేందర్, వైస్ఎంపీపీ బోజపల్లి సురేష్, నాగధర్‌రెడ్డి, మహిపాల్, రేగుల్లరాములు తదితరులు పాల్గొన్నారు.



వేల్పూర్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

హరితహారం మొక్కల పరిశీలన



అర్గూడ్ కెనాల్ కట్టపై హరితహారం మొక్కలను పరిశీలిస్తున్న చిత్రమిశ్రా

మాక్లూర్: మండలంలోని అర్గూడ్ శివారులో గల కెనాల్ కట్టపై గత సంవత్సరం హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలను శనివారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా పరిశీలించారు. వేసవి కాలం అయినందున ప్రతి రోజు చెట్లకు నీరు పట్టాలని పంచాయతీ సిబ్బందికి ఆమె సూచించారు. అలాగే రానున్న హరితహారంలో మొక్కలను నాటడానికి స్థలాన్ని పరిశీలించారు. విద్యుత్ వైర్ల కింద మినహ అన్ని చోట్ల హరితహారం మొక్కలు నాటుటకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. డీఆర్‌డీవో చందర్‌నాక్, ఉపాధిహామీ ఏపీఎం ఓంకార్ ఉన్నారు.

ఆధ్యాత్మికం..

ఆధ్యాత్మిక జీవనశైలిని అలవర్చుకోవాలి



బోధన్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక జీవన శైలిని అలవర్చుకోవాలని వీరశైవుల గురువు, రాష్ట్రీయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడు పురాణే అజయ్ కుమార్ బోధించారు. పట్టణంలోని ఏకచక్రేశ్వరాలయంలో ఏర్పాటు చేసిన అఖండ శివనామ సప్తాహం శనివారం మూడో రోజు కొనసాగింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పరమ రహస్య గ్రంథ పారాయణం, భజనలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆర్డీవో రాజేశ్వర్, ఏఎంసీ చైర్మన్ వీఆర్‌దేశాయ్, డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ బుజ్జి, సమాజ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అఖండ శివనామ సప్తాహం ప్రారంభం



రుద్రూర్: పోతంగల్‌లోని లింగమయ్యగుట్టపైన ఉన్న అమృతేశ్వర ఆలయం వద్ద శనివారం అఖండ శివనామ సప్తాహం ప్రారంభమైంది. ఉజ్జయిని ధర్మగురు ఆనంద సరస్వతీమహరాజ్ ఆధ్వర్యంలో సప్తహంతో పాటు మహా రుద్ర యజ్ఞ మహోత్సవ కొనసాగుతుందని నిర్వహకులు వెల్లడించారు. 29 వరకు కార్యక్రమం కొనసాగుతుందని వెల్లడించారు.

సమాచారం..

నేడు ఉపాధి హామీ ప్రజా వేదిక

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆదివారం ఉదయం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సంతోష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2020 జనవరి 1నుంచి మార్చి 31, 2023వరకు మండలంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను సామాజిక తనిఖీ బృందం తనిఖీ చేపట్టిందన్నారు. నివేదికను ప్రజా వేదిక ద్వారా బృందం సభ్యులు చదివి వినిపిస్తారని తెలిపారు. ఉపాధి హామీ, పోస్టల్ సిబ్బంది, అధికారులు హాజరుకావాలని కోరారు.

సంక్షిప్తం

చలివేంద్రం ప్రారంభం



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని ఖాందేష్ కాంప్లెక్స్ వద్ద శనివారం రక్ష స్వచ్ఛంధ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆర్మూర్ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఖాందేష్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

దళితరత్న అవార్డు గ్రహీతలకు సన్మానం

బోధన్: దళితరత్న అవార్డు పొందిన తెడ్డు పోశెట్టి (నవీపేట), జేఏసీ శంకర్ (బోధన్)ను శనివారం పట్టణంలోని ఏఎంసీ కార్యాలయంలో ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయ్ సన్మానించారు. టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రతినిధి విద్యాసాగర్, నక్క లింగారెడ్డి, సూరిబాబు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

నవీపేట: అక్షయ తృతీయ పర్వదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రానికి చెందిన జేవీవీ జిల్లా ప్రతినిధి రాజశేఖర్ దంపతులు శనివారం మజ్జిగ పంపిణీ చేశారు. అక్షయ తృతీయ రోజున ఆనందం కలిగించే పని చేయాలనే స్ఫూర్తితో మజ్జిగ పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



బాల్కొండ: మండలంలోని వన్నెల్(బి)లో సీసీ రోడ్డు పనులను శనివారం ఉప సర్పంచ్ కిషన్ ప్రారంభించారు. పీఏసీఎస్ చైర్మన్ సురాజ్‌రెడ్డి, మాజీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయం కోసం గ్రామానికి చెందిన దాతలు గుండోజీ రవీంధర్, శోభ దంపతులు రూ. 50వేలు విరాళంగా అందజేశారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ ఆలయ ఉత్సవాలు

ఇందల్వాయి: సిర్నాపల్లి గ్రామంలో శనివారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవాలు, రజక సంఘం ఆధ్వర్యంలో మడివేలు స్వామి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలను ఊరేగించి దేవ తలకు నైవేద్యం సమర్పించారు.